




# మనం
## మెదక్ సంగారెడ్డి సిద్దిపేట

సోమవారం | 16 | అక్టోబర్ | 2023 | పేజీలు : 8




- దళితులు నేటికి పేదలేనా సిగ్గుచేటు
- నాడు కటిక చీకట్లు..నేడు పంటలతో కలకల
- హుస్నాబాద్ గెలుపు బీఆర్ఎస్‌కు నాంది కావాలి
- పారిశ్రామిక రంగంలో మనకేవరు పోటీ లేరు
- కంటి నిండా నిద్ర, కళ్లాల నిండా వడ్లు
- ఒక్క చాన్స్ అంటున్న పార్టీకి పది చాన్స్‌లిచ్చాం
- గౌరవెల్లిని పూర్తి చేసే బాధ్యత నాదే
- రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు

# రౌతేందో...రత్నమేందో తెల్వుచ్చండ్రి

హుస్నాబాద్,అక్టోబర్ 15,(మనం న్యూస్)....

ఎలక్షన్ రాగానే మనం ఆగమాగం కావొద్దు..రౌతెందో...రత్నమేందో ఆలోచించాలని, మనకి పనికచ్చేది ఏదో గుర్తు పట్టాలి...ఎవరో చెప్పారని ఓటు వేయద్దు.. ఓటు అనేది మన తలరాతను మారుస్తది..మన తాలుక రాతను మారుస్తది...మన జిల్లా రాతను మారుస్తది..మన రాష్ట్రం యొక్క భవిష్యత్తును భావిస్తది కాబట్టి స్పష్టమైన అవగాహనతో ఓటింగ్ జరిగినపుడు ప్రజల కోరికలు నెరవేరుతాయని రాష్ట్ర ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అన్నారు. హుస్నాబాద్ పట్టణ శివారులో బీఆర్ఎస్ పార్టీ ఆదివారం ప్రజా ఆశీర్వాద సభతో సమరశంఖాన్ని పూరించింది. ఈ సభకు ముఖ్య అతిథిగా సీఎం కేసీఆర్ హజరై ప్రసంగించారు. 2018 శాసనసభ ఎన్నికల తొలి సభలో ఇక్కడికే వచ్చి ప్రసంగించాను అని ఆయన గుర్తు చేసారు. హుస్నాబాద్ గడ్డ ఆశీర్వాదంతో 88 సీట్లతో ఆఖండ విజయాన్ని సాధించామన్నారు. ఈ సారి కూడా పెద్దలందరూ చెప్పినారు హుస్నాబాద్ నుండే మళ్లీ జైత్రయాత్ర కొనసాగించాలన్నారు. హైదరాబాద్‌లో బీఆర్ఎస్ అభ్యర్థులకు బీ-ఫాంలు అందజేసి, మేనిఫెస్టోను ప్రకటించి మీ దర్శనానికి రావడం జరిగిందన్నారు. ఈ సభలో ఉన్నటువంటి ప్రతి ఒక్కరూ దయచేసి నేను చెప్పే మాటలు ఇక్కడనే విని విడిచిపెట్టి వెళ్లిపోవద్దు అన్నారు. గ్రామానికో, తండాకో పోయిన తర్వాత కేసీఆర్ మిగతా 2లో..









## కేసీఆర్ చేతుల మీదుగా బి ఫారమ్‌లు

వివరాలు 2లో..









# రౌతేందో...రత్నమేందో తెల్చుండ్రి

మొదటి పేజీ తరువాయి..

నాలుగు మాటలు చెప్పిండు నిజమెందో ఆలోచించాలన్నారు.తొమ్మిదన్నరేండ్ల క్రితం మన తెలంగాణ పరిస్థితేంటి, ఏవిధంగా ఉండేదో అన్నారు. తెలంగాణ పరిస్థితి ఎక్కడా చూసిన భయమే పరిస్థితి వలసలు కరువులు, సాగునీరు లేవు మంచినీళ్లు లేవు..కరెంటు లేదు..ఆర్థిక పరిస్థితి ఎట్లా ఉంటదో తెలువదు. కొత్తకుండలో ఈగ చొచ్చినట్టు ఉండేదన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత ప్రజలు బీఆర్ఎస్ పైనే నమ్మకం పెట్టడంతో చాలా బాధ్యతగా పెద్ద పెద్ద ఆర్థిక నిపుణులను రప్పించి రెండు మూడు నెలలు పాటు మెదడును కరగదీసామన్నారు. ఎటు చూసినా కటిక చీకటి..కరెంటు లేదు..నీళ్లు లేవు..పంటలు పండవు బ్రతకలేక వలస పోయినవారు కొందరు ఇక్కడే ఉండి చావలేక బ్రతుకుతున్నవారు కొందరు చాలా దారుణమైన పరిస్థితి ఉండేదని ఆయన గుర్తు చేసారు. 15 సంవత్సరాలు మనమందరం ఏకబిగిన పోరాటంతో తెలంగాణను తెచ్చుకున్నామన్నారు. తెచ్చుకున్న తెలంగాణను అనేక రంగాలలో మీ అందరి సహకారంతోని నెం.1 స్థానంకు తీసుకుపోయినమని ఆయన స్పష్టం చేసారు. తలసరి ఆదాయం, విద్యుత్ వినియోగం, మంచినీళ్ళ రంగంలో తెలంగాణ నెం.1 అన్నారు. పారిశ్రామిక విధానంలో మనకేవరు పోటీ లేరు..సాటిలేరన్నారు. పెట్టుబడులు సాధించడంలో 25 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించడంలో ప్రథమ స్థానంలో ఉన్నామని ఆయన తెలిపారు. కేంద్రం సహకారం లేకపోయినా ఇక్కడ ప్రతిపక్షాలు గౌరవెల్లి ప్రాజెక్టును అడ్డుకోవడానికి ఎన్నో కేసులేసి కుట్రలు చేసిన అన్నిటిని అధిగమించుకుంటూ ఒకటి, ఒకటి చేసుకుంటూ వచ్చినమన్నారు. అద్భుతమైన విజయాలు కొన్ని సాధించినమని, ఆక్రమం అట్టే కొనసాగాలన్నారు. ఎలక్షన్ రాగానే ఏవరో వస్తారు ఏదో చెప్తారు ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతారు ఆపద మొక్కులు కూడా మొక్కుతారన్నారు. కొన్ని పార్టీలు వచ్చి మాకు ఒక్క చాన్స్ ఇవ్వమని అడుగుతున్నాయి కదా ఒక్క చాన్స్ ఎందుకు మీకు పది చాన్స్‌లిచ్చిన, ఆరవై ఏండ్లు రాజ్యం మీరే పాలించి ఏమి చేసారంటూ ఆయన





ప్రశ్నించారు. దళితులు పేదరికంలో మగ్గుతున్నారంటే మనందరికీ సిగ్గుచేటన్నారు. 75 సంవత్సరాల స్వాతంత్ర్యం తర్వాత కూడా ఇంకా పేదరికం కమ్ముకుని ఉందంటే దేశమంతా సిగ్గుతో తలదించుకోవాలన్నారు. 60 ఏండ్ల క్రితమే దళితబంధులాంటి పథకం తీసుకువస్తే నేడు నిరుపేదలుగా ఉండేవారా అంటూ ఆయన ప్రశ్నించారు. పెన్షన్ రూ.1000 నుండి ప్రారంభించి రూ.5000 లు ఇస్తామని మేనిఫెస్టోలో పెట్టడం జరిగిందన్నారు. ప్రతి సంవత్సరం రూ.500 పెంచుతూ రూ.5 వేల పెన్షన్ చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. నాడు మోటర్లు, ట్రాన్స్‌పార్మర్‌లు కాలేవని..నేడు మోటర్లు కాలే ఊసే లేదని రైతులకు నాణ్యమైను ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నామని ఆయన తెలిపారు. గౌరవెల్లి మెయిన్ కేనాల్ 15 కి.మీ.తవ్వినారు..ఇంకో 30 కి.మీ.తవ్వాలి దానికి రూ.250 కోట్లు మంజూరై ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అందరం పట్టుపట్టి దాన్ని ఆరు నెలల్లోనే పూర్తి చేసుకుందాం అన్నారు. మహాసముద్రం గండి ప్రాజెక్టును నిర్మించి భూగర్భజలాలను పెంచినామని ఆయన తెలిపారు. తెలంగాణ వచ్చిన తర్వాత రైతులు కంటి నిండా నిద్ర పోతున్నారని కడుపు నిండా కరెంటు కల్లాల నిండా వడ్లు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. రెండు నెలలు వడ్లు కొంటున్న కల్లాల్లో వడ్లు వొడుస్తలేవన్నారు. ప్రపంచంలోనే మిషన్ భగీరథ పథకం ఎక్కడా లేదన్నారు. చిగురుమామడి మండలం డార్క్ ఏరియా ఉండేది మిడ్‌మానేరు నీళ్లతో పచ్చదనంగా మారిందన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తికి నేనే బాధ్యత తీసుకుంటున్నాని ఎలక్షన్‌లు పూర్తి అవ్వగానే ఆరు నెలల్లోనే యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి నీళ్లు వదిలిపెట్టడానికి మీ ఆశీర్వాదంతో ఇదే హోదాలో వస్తానని ఆయన స్పష్టం చేసారు. శనిగరం ప్రాజెక్టుకు లీకేజీలున్నాయి దానిని మరమ్మతు చేపిస్తానాని ఆయన హామీ ఇచ్చారు. కొత్తకొండ వీరభద్రుడి జాతర ఎంతో అద్భుతమైనదన్నారు. ఆలయాన్ని ఎంతో అద్భుతంగా తీర్చిదిద్దుతామన్నారు. జాతీయ రహదారులు కావాలని కోరడం జరిగిందని ప్రజలు కోరినవి అన్ని చిన్న చిన్న కోరికలేనని అన్ని పనులు పూర్తి చేస్తామన్నారు. దేశానికి మనం మార్గదర్శకం కావాలన్నారు. బీఆర్ఎస్ గెలవడం సతీశ్ ఎంత మంచి ఎమ్మెల్యేనో అందరికీ తెలుసు అన్నారు. అందరికీ అందుబాటులో ఉంటూ తలలో నాలుకలాగా ఉంటూ బ్రహ్మాండంగా పని చేస్తూ ఉన్నాడు. ఇటువంటి ఎమ్మెల్యేలు చాలా తక్కువగా ఉంటారన్నారు. సభకు వచ్చిన జనాన్ని చూస్తేనే మీ సతీశ్‌కుమార్ ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిచినట్టేనని ఆయన ధీమా వ్యక్తం చేసారు. హుస్నాబాద్ గెలుపే 95 నుండి 105 సీట్ల మధ్య బీఆర్ఎస్ గెలవడానికి నాంది కావాలన్నారు. బీఆర్ఎస్ మేనిఫెస్టోను ప్రతి గ్రామ గ్రామాన, గడప గడపకు తీసుకెళ్లి ప్రచారం నిర్వహించాలన్నారు. ఆనంతరం సభ ప్రజల మధ్యలోనే ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌కు సీఎం కేసీఆర్ బీ-ఫామ్‌ను అందజేసారు. ఈసమావేశంలో మంత్రి హరీశ్‌రావు, రాష్ట్ర ప్రణాళిక వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్, జడ్పీచైర్మన్‌లు రోజాశర్మ, సుధీర్‌కుమార్, ఆయా మండలాల ఎంపీపీలు, జడ్పీటీసీలు, ప్రజాప్రతినిధులు, తదితరులున్నారు.

## కేసీఆర్ చేతుల మీదుగా బి ఫారమ్‌లు

సిద్దిపేట, అక్టోబర్ 15, మనం న్యూస్ ప్రతినిధిః రాబోయే సార్వత్రిక ఎన్నికలకు గాను బిఆర్ఎస్ పార్టీ ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించిన నేపథ్యంలో ఆదివారం నాడు తెలంగాణ భవన్‌లో అభ్యర్థులకు బి ఫారమ్‌లు అందజేశారు. సిద్దిపేట నియోజకవర్గం నుండి ఏడవసారి బిఆర్ఎస్ అభ్యర్థిగా మంత్రి హరీష్‌రావు పార్టీ అధినేత కేసీఆర్ చేతుల మీదుగా బి ఫారమ్ అందుకున్నారు. అదేవిధంగా మెదక్ నుండి పద్మా దేవేందర్‌రెడ్డి, దుబ్బాక నియోజకవర్గం నుండి కొత్త ప్రభాకర్‌రెడ్డి, పటాన్‌చెరు నుండి గూడెం మహిపాల్‌రెడ్డి, నారాయణ ఖేడ్ నుండి భూపాల్‌రెడ్డిలకు, ఆందోల్ నుండి చంటి క్రాంతి కిరణ్‌కు బి ఫారమ్‌లు అందజేయగా హుస్నాబాద్ బి ఫారమ్‌ను హుస్నాబాద్ నుంచి కేసీఆర్ మొదలు పెట్టిన ఎన్నికల ప్రచార సభ వేదిక పైనే వొడితల సతీష్‌కుమార్‌కు బి ఫారమ్‌ను అందజేశారు.

# మూడోసారి కేసీఆర్‌ను ఆశీర్వదించాలి

**- గౌరవెల్లిని అడ్డుకున్న ప్రతిపక్షాలు**

**- ఎలక్షన్‌లు ముగిసిన వెంటనే ప్రారంభించుకుందాం**

**- హుస్నాబాద్ అభ్యర్థిగా మీ ముందుకు వస్తున్నా**

**- ఆశీర్వదించండి : ఎమ్మెల్యే సతీశ్‌కుమార్**

హుస్నాబాద్,అక్టోబర్ 15,(మనం న్యూస్)ః మూడోసారి కేసీఆర్‌ను సీఎంగా చేసేందుకు కారు గుర్తుకు ఓటేసి ప్రజలందరూ ఆశీర్వదించాలని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యావత్ తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ మొదలైన తర్వాత మొదటి శంఖారావం హుస్నాబాద్ నియోజకవర్గం నుండి ప్రారంభమయ్యిందన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గం సీఎం కేసీఆర్‌కు లక్ష్మీ నియోజకవర్గమన్నారు. కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను తీసుకువచ్చారని ఆయన కొనియాడారు. 2014 కు ముందు హుస్నాబాద్ నియోజకవర్గం కరువు కాటకాలతో విలవిలాడేదని అన్నారు. ఇప్పుడు ఎక్కడికి పైన మిషన్ భగీరథ, మిషన్ కాకతీ య పథకాలతో భూగర్భజలాలు పెరిగాయన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు దరిదాపు పూర్తి కావచ్చిందన్నారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ కేసు ద్వారా ప్రాజెక్టును ప్రారంభించుకోలేకపోయామన్నారు. కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ పార్టీలు తెలంగాణ రాష్ట్రంలోనే కాదు హుస్నాబాద్‌లో ఏ ఒక్క రైతుకు నీరు అందివ్వాలని వాళ్లకు లేదన్నారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్‌లో అందుకోసమే ప్రతిపక్షాలు కేసులు వేయడం జరిగిందన్నారు. ఎన్నికలు పూర్తయిన తర్వాత మూడోసారి సీఎంగా కేసీఆర్‌ను చేసుకొని గౌరవెల్లి ప్రాజెక్టును బ్రహ్మాండంగా



ప్రారంభించుకుందామన్నారు. రైతులందరికి లక్షా ఆరు వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. శనిగరం , సింగరాయ ప్రాజెక్టులను పునర్నిర్మాణం చేసుకున్నామని ఆయన తెలిపారు. కాకతీయ కాలువ ద్వారా ఎల్కతుర్తి మండలంలో గోదావరి నీళ్లు తీసుకువచ్చామన్నారు. గ్రామ గ్రామాన రోడ్డు వేసుకున్నామని ఆయన తెలిపారు. తండాలకు రోడ్లు లేవని సీఎం కేసీఆర్‌ను కోరిన వెంటనే రూ.61 కోట్లు మంజూరీ చేసారని ఆయన గుర్తు చేసారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో రూ.90 వేల కోట్ల అభివృద్ధి జరిగిందన్నారు. 2014 కంటే ముందు హుస్నాబాద్ నియోజకవర్గం ఎలా ఉండేది ఇప్పుడు ఎలా ఉందో ప్రజలు ఆలోచించాలన్నారు. నవంబర్ 30 న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటేసి ఆశీర్వాదించాలని ఆయన కోరారు. మీ ఆశీర్వాదంతోనే మూడోసారి కేసీఆర్ సీఎం అవ్వాలన్నారు.

# ఆశీర్వదించి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తా

### తొమ్మిదేండ్ల బిఆర్ఎస్ పాలనలో నియోజకవర్గం వెనుకంజ

### -అధికార పార్టీ అనుయాయులకే సంక్షేమ పథకాల అమలు

### -బీజేపి దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు





మిరుదొడ్డి, అక్టోబర్ 15, మనం న్యూస్ః ప్రజలు ఆశీర్వదించి తనకు ఓటేసి గెలిపించినట్లయితే దుబ్బాక నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. ఆదివారం మిరుదొడ్డి మండల పరిధిలోని కాసులాబాద్, మల్లుపల్లి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుబ్బాకలో రాష్ట్రంలో టీఆర్ఎస్ పార్టీలో ఉన్న ఏ ఒక్క ఎమ్మెల్యే కూడా శాసనసభలో గళం విప్పిన నాయకుడు లేడన్నారు. దుబ్బాక నియోజకవర్గ ప్రజల పక్షాన తనను ఎమ్మెల్యేగా గెలిపించినందుకు నిండు శాసనసభలో దుబ్బాక నియోజకవర్గ సమస్యలపై గళం వినిపించడం జరిగిందన్నారు. అధికార పార్టీ అనుచరులకు మాత్రమే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయడం జరుగుతుందని ఆరోపించారు. రెండున్నర సంవత్సరాల కాలంలో దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధికి తాను కృషి చేయడం జరిగిందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంలో బిఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. తొమ్మిదేండ్ల బిఆర్ఎస్ పరిపాలనలో దుబ్బాక నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకంజలో ఉందన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజలకు సముచిత ప్రాధాన్యత కల్పించడం జరిగిందన్నారు. హైదరాబాద్‌లో నిరుద్యోగ యువతి ప్రవళిక ఆత్మహత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీని పూర్తిగా అమలు చేయకుండా తూతూమంత్రంగా అమలు చేస్తూ ప్రజలను మభ్యపెట్టడం జరుగుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపికి ఓటేసి తనను గెలిపించినట్లయితే సిద్దిపేట, గజ్వేల్ తరహాలో దుబ్బాక నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుంచుతారన్నారు. అనంతరం కాసులాబాద్, మల్లుపల్లి గ్రామాల్లో పలువురు నాయకులు బీజేపిలో చేరడంతో వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అద్యక్షులు దేవరాజుతోపాటు మండల బీజేపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గజ్వేల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తూముకుంట నర్సారెడ్డి

### టికెట్ కేటాయించిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానం



కొండపాక, అక్టోబర్ 15, మనం న్యూస్ః గజ్వేల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తూముకుంట నర్సారెడ్డిని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ప్రకటించింది. గతంలో కాంగ్రెస్ పార్టీ తరుపున ఎమ్మెల్యేగా పని చేసిన నర్సారెడ్డి మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. తూముకుంట నర్సారెడ్డి రైతు కుటుంబం లో పుట్టి ఎలాంటి రాజకీయ నేపథ్యం లేని కుటుంబం నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ ఎమ్మెల్యేగా పని చేసి, జిల్లా పార్టీ అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. నర్సారెడ్డి గ్రామ వార్డు మెంబర్‌గా సర్పంచ్‌గా, ఎంపిటిసిగా, ఎంపిపిగా, పిఏసిఎస్ డైరెక్టర్‌గా, డిసిసిబి జిల్లా ఛైర్మన్‌గా అంచెలంచెలుగా ఎదుగుతూ గజ్వేల్ నుండి మొదటిసారిగా కాంగ్రెస్ పార్టీ నుండి బరిలో దిగి టీఆర్ఎస్, టిడిపి ఉమ్మడి అభ్యర్థి బూర్గుపల్లి ప్రతాప్‌రెడ్డిపై విజయం సాధించారు. అనంతర పరిణామాలలో తెలంగాణ ఉద్యమం ఊపందుకున్న సమయంలో తెలంగాణ సాధన కోసం నేను సైతం అని తెలంగాణ సాధన ఏకైక లక్ష్యమని తెలంగాణ సాధన కాంగ్రెస్ పార్టీ వల్లనే సాధ్యమవుతుందని ఉద్యమంలో పాల్గొని ఆమరణ నిరాహార దీక్ష కూడా చేపట్టారు. ఈ నే పథ్యంలో తూముకుంట నర్సారెడ్డి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో మంచి పేరు సంపాదించుకున్నారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం చంద్రశేఖర్‌రావు పోటీ చేసిన క్రమంలో 2014లో పోటీ చేసి ఓటమిపాలైనప్పటికీ రాజకీయాల్లో తనదైన శైలిలో కార్యకర్తలకు అండగా ఉన్నారు. 2018 ఎన్నికల్లో బూరుగుపల్లి ప్రతాప్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ప్రతాప్‌రెడ్డికి మద్ధతు పలికి గజ్వేల్ నియోజకవర్గ ఎమ్మెల్యే సీటు ప్రతాప్‌రెడ్డికి ఇప్పించారు. ఆ ఎన్నికల్లో ప్రతాప్‌రెడ్డి ఓటమిపాలయ్యాడు.. కొన్ని అనివార్య కారణాల వల్ల ప్రతాప్‌రెడ్డి, నర్సారెడ్డిలు తెరాస పార్టీ తీర్థం పుచ్చుకొని తెరాస పార్టీలో కొన్ని రోజుల పాటు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నర్సారెడ్డికి ఆర్టీసి ఛైర్మన్ పదవి ఇచ్చినప్పటికీ తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో సీఎం కేసీఆర్‌ను కలవడానికి సైతం వీలు లేకపోవడంతో తెరాస పార్టీలో తనకు స్థానం దక్కడం లేదని మనస్థాపంతో పార్టీకి రాజీనామా చేసి తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతర పరిణామాల్లో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా కొనసాగుతూ కార్యకర్తలను సమీకరించడంలో సఫలీకృతులయ్యారు. గతంలో పని చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను సమీకరించి పూర్వ వైభవం ఇవ్వడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో గజ్వేల్ నుండి తగిన అభ్యర్థిగా నర్సారెడ్డిని గుర్తించి టికెట్ కట్టబెట్టినట్లు కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. గతంలో ఉన్న కార్యకర్తలతో మంచి పరిచయాలు ఉన్నాయని, నియోజకవర్గంలో ఉన్న పాత పరిచయాలతో ప్రభుత్వ వ్యతిరేక ఓట్లతో గెలుస్తానని కాంగ్రెస్ పార్టీ భావిస్తుంది.

## దళితుల ఓట్ల కోసమే బిఆర్ఎస్ కుట్ర

### అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలన్నదే ఎమ్మెల్యే ఆకాంక్ష

### బీజేపి జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దెల రోశయ్య



మిరుదొడ్డి, అక్టోబర్ 15, మనం న్యూస్ః దళితుల ఓట్లతో రాజకీయ లబ్ధి పొందడం కోసం బిఆర్ఎస్ పార్టీ కుట్ర పన్నుతుందని బీజేపి పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దెల రోశయ్య విమర్శించారు. ఆదివారం బీజేపి నాయకులతో కలిసి మిరుదొడ్డి మండల కేంద్రంలోని బీజేపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితులందరికీ దళితబంధు ఇవ్వాలని ఎమ్మెల్యే రఘునందన్‌రావు సూచిస్తే బిఆర్ఎస్ నాయకులు విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. రాజకీయ లబ్ధి కోసం గ్రామాల్లో ఒకరిద్దరికి దళితబంధు అందజేసి బిఆర్ఎస్ నాయకులు చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానన్న కేసీఆర్ మాట ఎందుకు తప్పాడో ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే రఘునందన్‌రావుపై విమర్శలు చేస్తే సహించేది లేదన్నారు. ఈ సమావేశంలో బీజేపి నాయకులు మల్లేశం, అమర్, స్వామి, రవి, కుమార్‌తోపాటు తదితరులు ఉన్నారు.

## బిఆర్ఎస్ అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డిని లక్షపై చిలుకు మెజార్టీతో గెలిపించాలి

### బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు తోట అంజిరెడ్డి



మిరుదొడ్డి, అక్టోబర్ 15, మనం న్యూస్ః జరగబోయే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి బిఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిని లక్ష మెజార్టీ పై చిలుకుతో గెలిపించాలని బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు తోట అంజిరెడ్డి అన్నారు. ఆదివారం సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన మేనిఫెస్టో సందర్భంగా మిరుదొడ్డి మండల కేంద్రంలో బిఆర్ఎస్ నాయకులతో కలిసి టపాకాయలు పేల్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాల్లో జరగని అభివృద్ధి ప్రత్యేకరాష్ట్రంలో కేసీఆర్ సారథ్యంలో రాష్ట్రం ఎంతగానో అభివృద్ధి చెందిందన్నారు. దుబ్బాక నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవాలంటే కారు గుర్తుకు ఓటేసి కొత్త ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపిపి పోలీస్ రాజులు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు తుమ్మల బాల్‌రాజు, బిఆర్ఎస్ నాయకులు సత్యనారాయణ, బాపురెడ్డి, రాములు, పర్శరాములు గౌడ్, లింగం, నర్సింలు, ఎల్లయ్య, సత్తయ్య, రాధాకృష్ణ, శేఖర్, హైమద్, బైరయ్యతోపాటు తదితరులు ఉన్నారు.

## ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలి

### బిఆర్ఎస్‌వి రాష్ట్ర ఉపాధ్యక్షులు కోతి విజయ్



చేర్యాల, అక్టోబర్ 15, మనం న్యూస్ః నేడు జనగామలో బిఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని బిఆర్ఎస్‌వి రాష్ట్ర ఉపాధ్యక్షులు కోతి విజయ్ కోరారు. ఆదివారం చేర్యాల పట్టణ కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ జనగామలో సీఎం కేసీఆర్ జనగామ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పల్ల రాజేశ్వర్‌రెడ్డి చేపట్టబోయే ప్రజా ఆశీర్వాద సభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని విజయ్ కోరారు. ప్రభుత్వం అందిస్తున్న అనేక సంక్షేమ పథకాలు ఈ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. రైతులను ఆదుకునే పార్టీ బిఆర్ఎస్ పార్టీ ఒక్కటే అన్నారు.

## బాధిత కుటుంబాలకు అండగా కాంగ్రెస్ పార్టీ

### మండల పార్టీ అధ్యక్షులు మద్దెల రాజేశం



మిరుదొడ్డి, అక్టోబర్ 15, మనం న్యూస్ః బాధిత కుటుంబాలకు అండగా కాంగ్రెస్ పార్టీ నిలుస్తుందని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు మద్దెల రాజేశం అన్నారు. ఆదివారం మిరుదొడ్డి మండల పరిధిలోని చెప్యాల గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన రాములు కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు వారి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందించడం జరిగిందన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు కన్నారెడ్డి, బిక్షపతి, చంద్రం, శివారెడ్డి, కిష్టయ్య, కర్ణాకర్, రాజిరెడ్డి, షాదుల్‌తోపాటు తదితరులు ఉన్నారు.

# కొండపాక బిఆర్ఎస్‌లో తిరుగుబాటు

-మా ఎమ్మెల్యే కేసీఆర్ మాకు హామీ ఇవ్వాలి

-స్థానిక నాయకులతో, మంత్రితో మాకు పనులు కావు

-మంత్రి వల్లనే మాకు అన్యాయం జరిగింది

-అధిష్టానం స్పందించకుంటే రాజీనామాకు సిద్ధం

-టీఆర్ఎస్ సీనియర్ నాయకుల హెచ్చరిక



కొండపాక, అక్టోబర్ 15, మనం న్యూస్‌: టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం నుండి పార్టీలో పని చేస్తూ ప్రజా నాయకులుగా ఉన్నప్పటికీ స్థానిక నాయకులు మా పై సమాచారం అధిష్టానానికి నివేదిస్తూ మమ్ములను పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపించారు. మంత్రి హరీష్‌రావు మా సమస్యలను ఏనాడూ పరిష్కరించలేదని, సీఎం నియోజకవర్గంలో ఉన్నప్పటికీ కొండపాక మండలం ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని స్థానికంగా ఉన్న నాయకులే మంత్రికి కల్పించి చెప్పడం వల్ల సీనియర్ నాయకులకు అవమానం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తొమ్మిదిన్నరేళ్ల నుండి నిజమైన కార్యకర్తలకు అన్యాయం జరుగుతున్నా పట్టించుకున్న నాయకుడు కరువయ్యారన్నారు. ఆదివారం నాడు దుద్దెడ శివారులో ఎల్లమ్మ ఆలయం వద్ద టీఆర్ఎస్ అసమ్మతి నాయకులు సమావేశం ఏర్పాటు చేసి తమ గోడు వెల్లబోశారు. గ్రామాలలో కొంతమంది నాయకులతో మండల నాయకులు కుమ్మక్కై వారి అనుయాయులకే దళితబంధు, గృహలక్ష్మి, బిసి బంధు ఇచ్చారన్నారు. మా గ్రామాలు అభివృద్ధి చెందడంలేదని ప్రశ్నిస్తే జైల్లో వేయించారని అంకిరెడ్డిపల్లి మాజీ సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు. గజ్వేల్‌కు ఇంచార్జ్‌గా వ్యవహరిస్తున్న బూర్గుపల్లి ప్రతాప్‌రెడ్డి తన అనుచరులకు మాత్రమే పని చేస్తూ సీనియర్లయిన మమ్ములను పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. కేసీఆర్‌పై పోటీ చేసి కేసీఆర్ ఓటమికి ప్రయత్నించిన ప్రతాప్‌రెడ్డికి పార్టీ బాధ్యతలు అప్పజెప్పితే మాపై కక్ష కట్టారన్నారు. కొండపాక మండలంలో ఉన్న కార్యకర్తలకు ఏ కష్టం



వచ్చినా ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదన్నారు. ఆపదలో ఉన్న వారిని సైతం ఆదుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి హరీష్‌రావు దగ్గరికి వెళ్తే మా నియోజకవర్గం కాదు అని కరాకండిగా చెప్పిన సందర్భాలు ఎన్నో ఉన్నాయన్నారు. అన్ని రంగాలలో కొండపాక మండలం వెనుకబడిపోయిందని మాకు అభివృద్ధి పనులు కావాలంటే ఎవరికి చెప్పుకోలేని పరిస్థితిలో ఉన్నాయని, మాకు అన్యాయం జరుగుతుందని ఆరోపించారు. మాకు ఆపద సంభవిస్తే పలకరించిన నాథుడే లేడని మాజీ ఎంపిటిసి, సీనియర్ నాయకులు దోమల ఎల్లం ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం వరకు అధిష్టానం నుండి పిలుపు రాకపోతే రాజీనామా చేస్తామని అధిష్టానాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని గ్రామాల ప్రజలతోపాటు గ్రామ కమిటీ అధ్యక్షులు, పిఎసిఎస్ డైరెక్టర్లు విద్యాసంబయ్య, బూర్గుల సురేందర్‌రావు, మాజీ సర్పంచ్ పెద్దెంకుల శ్రీనివాస్, సుమారు 200 మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

## సామాన్యులపై వరాల జల్లు

### బిఆర్ఎస్ మేనిఫెస్టో పట్ల శ్రేణుల సంబరాలు



జెజ్జంకి, అక్టోబర్ 15, మనం న్యూస్‌: సీఎం కేసీఆర్ ఆదివారం ప్రకటించిన బిఆర్ఎస్ మేనిఫెస్టో సామాన్య ప్రజలపై వరాల జల్లు కురిపించినట్లుగా ఉందని బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పాకాల మహిపాల్‌రెడ్డి అన్నారు. బెజ్జంకి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బిఆర్ఎస్ మండల అధ్యక్షులు పాకాల మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో టపాకాయలు పేల్చి సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుబంధు పథకం కింద అందించే ప్రయోజనాన్ని పెంచి రైతుబంధు రూ 16 వేలకు పెంచారని, దీని వల్ల చాలా మంది అన్నదాతలకు ఊరట కలుగుతుందని, మార్చి తర్వాత రూ. 12 వేలు, క్రమంగా పెంచుతూ ఐదవ సంవత్సరం నిండే నాటికి రూ. 16 వేలు అందిస్తామని, గ్యాస్ సిలిండర్ వినియోగదారులకు సైతం రూ.400లకే సిలిండర్ ఇస్తామని, పెన్షన్ తీసుకునే వారికి పింఛన్ కూడా పెంచుతున్నట్లు వెల్లడించారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన పార్టీ మేనిఫెస్టో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అందరికి ఆమోదయోగ్యంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు లింగాల లక్ష్మణ్, కనగండ్ల తిరుపతి, రాష్ట్ర నాయకులు చింతకింది శ్రీనివాస్ గుప్త, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి

### దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి



తొగుట, అక్టోబర్ 15, మనం న్యూస్‌: వచ్చే ఎన్నికల్లో దుబ్బాక నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని దుబ్బాక కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి తొగుట మండలం కాన్గల్ గ్రామంలో కార్యకర్తలతో ఆత్మీయ పలకరింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రకటించిర ఆరు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, పేద ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టనున్న ఆరు గ్యారంటీల పట్ల అవగాహన కల్పించాలని కోరారు. బిఆర్ఎస్, బీజేపి నాయకుల మోసపూరిత వాగ్దానాలను నమ్మవద్దని, బడుగు, బలహీన వర్గాలకు కాంగ్రెస్ పార్టీతోనే న్యాయం జరుగుతుందని వివరించాలన్నారు. గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులంతా కలిసికట్టుగా ఉండి పార్టీని భారీ మెజార్టీతో గెలిపించే విధంగా కృషి చేయాలని కోరారు. అనంతరం ఎన్నికల ప్రచార నిర్వహణపై సమాలోచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గాంధారి నరేందర్‌రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు బషీరొద్దీన్, ఫిషర్‌మెన్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు పిట్ల సత్తయ్య, యూత్ అధ్యక్షులు ముడికె స్వామి, సోమగారి కొండల్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, అంజిరెడ్డి, బిక్షపతి, నర్సింలు, స్వామి గౌడ్, షఫీతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసేవ చేస్తూనే ఉన్నాం... సీఎం కేసీఆర్ గుర్తించాలి

### మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం



చేర్యాల, అక్టోబర్ 15, మనం న్యూస్‌: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతోపాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ నిత్యం ప్రజాసేవ చేస్తూనే ఉన్నామని, మూడు సంవత్సరాల నుండి తన కుమారుడు కిరణ్‌కుమార్ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నాడని, ఈ విషయాన్ని సీఎం కేసీఆర్ గుర్తించాలని మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం అన్నారు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే నాగపురి స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. చేర్యాల ఒకప్పుడు తాలూకాగా, నియోజకవర్గ కేంద్రంగా ఉండి నేడు అన్ని కోల్పోయి వెలవెలబోయిందన్నారు. గత 32 రోజులుగా రెవెన్యూ డివిజన్ కోసం ఇక్కడి ప్రాంత ప్రజలు రిలే నిరాహార దీక్షలు చేశారని, సీఎం కేసీఆర్ వెంటనే గుర్తించి చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని కోరారు. గత 50 సంవత్సరాలుగా రాజకీయంలో ఉంటూ ప్రజాసేవ చేస్తున్న తమ కుటుంబాన్ని గుర్తించకుండా స్థానికేతరుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డిని తీసుకువచ్చి ఇక్కడి ప్రాంతంలో నిలబెట్టడం ఎంత వరకు సమంజసమన్నారు. వారి వెంట గాల్‌రెడ్డి ఉన్నారు.

## బాధిత కుటుంబానికి బియ్యం అందజేత



జగదేవ్‌పూర్, అక్టోబర్ 15, మనం న్యూస్‌: జగదేవ్‌పూర్ మండల పరిధిలోని పలుగుగడ్డ గ్రామానికి చెందిన లోకుల కిష్టయ్య వారం రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పిట్టల ఎల్లేష్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం వారి కుటుంబానికి 50 కిలోల బియ్యం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం చేయడం ఎంతో స ంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఇస్తారి, రామచంద్రం, ముదిరాజ్ నాయకులు రవి, వెంకటేష్, రాజ్‌కుమార్, నర్సింలు, కృష్ణ, రాజు, ఐలయ్య, కర్ణాకర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

### గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్



కొండపాక, అక్టోబర్ 15, మనం న్యూస్‌: జగదేవ్‌పూర్ మండల పరిధిలోని తీగుల్ గ్రామ పంచాయతీ సిబ్బంది ముగ్గురు మృతి చెందడం చాలా బాధాకరమని, వారి కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తూ, రూ. 10 లక్షల ఆర్థిక సాయం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఆదివారం జగదేవ్‌పూర్ ఎంపిడిఓను కలిసి మరణించిన వారి ఒక్కొక్కరి కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగం, రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. ఆయన వెంట జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్, జిల్లా నాయకులు పర్శరాములు, అభిలాష్, కరుణాకర్, రాంరెడ్డి, బాల్‌నారాయణ, లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

# సీఎం ఇలాఖాలో బిఆర్ఎస్‌లో చీలిక

**-సీనియర్లను పట్టించుకోవడం లేదంటూ ఆవేదన**

**-మంత్రి పెత్తనమేందంటూ గుస్సా**

**-కేసీఆర్ మాట్లాడకుంటే పార్టీ మార్పు**

**-ఈనెల 18న కార్యాచరణ... బీజేపిలో చేరే ఆలోచన...?**



కొండపాక, అక్టోబర్ 15, మనం న్యూస్ః రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్‌లో బిఆర్ఎస్‌లో చీలిక ఏర్పడిందా అంటే ఔననే సమాధానం వస్తుంది. ఒక వైపు మూడవసారి ప్రభుత్వ ఏర్పాటే లక్ష్యంగా గెలుపు బాధ్యతలను భుజాన వేసుకొని కేసీఆర్ హుస్నాబాద్ శంఖారావం పేరుతో ఎన్నికల సమరానికి సిద్ధమవుతున్న వేళ గజ్వేల్‌లో బిఆర్ఎస్‌లో చీలిక కాక రేపుతోంది. మాజీ మున్సిపల్ ఛైర్మన్ గాడిపల్లి భాస్కర్, సీనియర్ నాయకులు బద్దూరి వెంకట్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఓ ఫామ్ హౌజ్‌లో సుమారు వందమంది నాయకులతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. తొలి నుండి పార్టీలో ఉంటూ అనేక ఒడిదుడుకులు ఎదుర్కొని చివరకు లాఠీ దెబ్బలు తిని పార్టీ కోసం జెండా మోస్తుంటే తమకు ప్రాధాన్యత కరువైందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ గెలిపే లక్ష్యంగా కృషి చేసి ప్రస్తుత ముఖ్యమంత్రి కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తే కనీసం పట్టించుకోవడం లేదన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి ఇప్పటి వరకు ఏ ఒక్క రోజు తమను పట్టించుకోలేదని, పార్టీ కోసం పని చేసే వారిని కాకుండా ఇతర పార్టీల నుండి వచ్చిన వారికే ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. నిన్నగాక మొన్న పార్టీలోకి వచ్చిన వ్యక్తికి పదవులివ్వడమే కాకుండా నియోజకవర్గ బాధ్యతలను అతనికే అప్పగిస్తూ తమను విస్మరించడం బాధించిందన్నారు. గజ్వేల్‌లో సీనియర్లను అణిచివేయడంలో మంత్రి హరీష్‌రావు క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నాడని, తనకు నచ్చిన వారినే అందల మెక్కిస్తూ పార్టీ కోసం పని చేసిన వారిని అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారన్నారు. గజ్వేల్‌లో హరీష్‌రావు పెత్తనం ఏంటని, మంత్రి హోదాలో చేస్తే చేయని.. తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెండుసార్లు కేసీఆర్‌ను గెలిపించి, రెండుసార్లు ప్రభుత్వ ఏర్పాటులో తాము భాగస్వామ్యం అయ్యామని, మా ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యే మాతో మాట్లాడకుంటే ఎలా అన్నారు. ఈనెల 18వ తేదీ లోపు ఎమ్మెల్యేగా గెలిచిన కేసీఆర్ తమతో మాట్లాడాలని, లేనిపక్షంలో పార్టీ మార్పుపై మూకుమ్మడి నిర్ణయం తీసుకుంటామన్నారు.

**-మంత్రి హరీష్ బుజ్జగింపు**

బిఆర్ఎస్ అసమ్మతి నేతలు రహస్యంగా సమావేశమైనట్లు తెలుసుకున్న మంత్రి హరీష్‌రావు నేరుగా వారితో ఫోన్‌లో సంప్రదింపులు జరిపినట్లు తెలుస్తోంది. చిన్నచిన్న పొరపాట్లు దొర్లితే సరిదిద్దుకుందామని, పార్టీ కోసం అందరం కలిసి పని చేద్దామని సూచించినప్పటికీ కేసీఆర్ మాట్లాడితే తప్ప తమ పట్టు వీడేదే లేదని చెప్పినట్లు సమాచారం.

**-బీజేపిలో చేరేందుకు రంగం...?**

గజ్వేల్ బిఆర్ఎస్ రెండు వర్గాలుగా మారగా గాడిపల్లి భాస్కర్ ఆధ్వర్యంలోని నాయకులంతా మరో పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. గజ్వేల్ నియోజకవర్గం నుండి బీజేపి అభ్యర్థిగా ఈటల రాజేందర్ పోటీ చేస్తారనే ఊహాగానాలు వెలువడుతున్న సందర్భంలో అదే నిజమైతే ఈనెల 18వ తేదీన ఈటల సమక్షంలో పార్టీలో చేరేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించినట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా గజ్వేల్‌లో ఏ పార్టీ గెలిస్తే ఆ పార్టీ అధికారంలోకి వస్తుందన్న సెంటిమెంట్ బలంగా ఉన్న నేపథ్యంలో బిఆర్ఎస్‌లో చీలిక ఎటువైపు దారితీస్తుందో తెలియాలంటే మరికొద్ది కాలం వేచి చూడాల్సిందే మరి.



## ప్రారంభమైన దేవి నవరాత్రి ఉత్సవాలు

**ఆయా గ్రామాల్లో అమ్మవార్ల ప్రతిష్ట**



కొండపాక, అక్టోబర్ 15, మనం న్యూస్ః మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో దేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన మండపాలలో దేవి ప్రతిమలను ప్రతిష్టించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మర్పడగ మల్లికార్జున స్వామి ఆలయంలో దేవి నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు. దుద్దెడ గ్రామ చైతన్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. బందారంలో రవీంద్రనగర్, ఆరెపల్లి, సిరిసినగండ్ల, కొండపాక తదితర గ్రామాల్లో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్టించి ప్రత్యేక పూజలు నిర్వహించి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించారు. నవరాత్రుల్లో తొలిరోజైన ఆదివారం దుద్దెడ గ్రామంలో దుర్గాదేవి విగ్రహాన్ని స్థానిక స్వయంభు శంభు దేవాలయం నుండి ఘనంగా స్వాగత యాత్రతతో మండపం వద్దకు తీసుకువచ్చి ప్రతిష్టించారు. గ్రామానికి చెందిన మహిళలు మంగళ హారతులతో దుర్గాదేవికి స్వాగతం పలికారు. బాణాసంచాలు కాలుస్తూ బ్యాండ్ చప్పుళ్లతో అమ్మవారిని భారీ ఊరేగింపుతో తీసుకొని వచ్చి మండపంలో ప్రతిష్టించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిపారు.

## బిఆర్ఎస్ విజయం తథ్యం

**-మూడవ సారీ కేసీఆర్ సర్కారే**

**-సిద్దిపేటలో రికార్డు మెజార్టీ ఖాయం**



సిద్దిపేట, అక్టోబర్ 15, మనం న్యూస్ ప్రతినిధిః ముచ్చటగా మూడోసారి బిఆర్ఎస్ పార్టీ అధికారం చేపట్టడం ఖాయమని సిద్దిపేట పట్టణ ఉపాధ్యక్షులు మేడిశెట్టి శ్రీనివాస్ అన్నారు. అభివృద్ధి సంక్షేమంలో అగ్రగామిగా దూసుకెళ్తున్న తెలంగాణ రాష్ట్రం నేడు దేశానికే దిక్సూచిగా మారిందన్నారు. గత తొమ్మిదిన్నరేండ్ల కేసీఆర్ పాలనలో అద్భుతాలు జరిగాయని, సంక్షేమ పథకాల ఫలాలు, అభివృద్ధి కార్య క్రమాలే బిఆర్ఎస్ విజయానికి దోహదమవుతాయన్నారు. ఒకనాడు తాగునీటి కోసం విలవిలలాడిన తెలంగాణ ప్రాంతం నేడు కేసీఆర్ నేతృత్వంలో, హరీష్‌రావు ఆధ్వర్యంలో పూర్తయిన కాళేశ్వరం ద్వారా గోదావరి జలాలు పంటలను తడుపుతున్నాయన్నారు. కల్లాల నిండా ధాన్యంతో రైతుల బతుకుల్లో కొత్త కాంతులు కనిపిస్తున్నాయన్నారు. ఆదివారం ప్రకటించిన బిఆర్ఎస్ మేనిఫెస్టోతో ప్రతిపక్షాలకు గుండె లయ తప్పుతుందన్నారు. ఏది ఏమైనా ప్రతిపక్షాలు ఎన్ని జిమ్మిక్కులు చేసినా మూడవసారి బిఆర్ఎస్ ప్రభుత్వం,హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్, 1 లక్ష 50 వేల మెజార్టీతో సిద్దిపేటలో హరీష్‌రావు విజయం ముమ్మాటికీ ఖాయమన్నారు. ప్రగతి నివేదన శంఖారావం పేరుతో ఈనెల 17వ తేదీన సిద్దిపేటలోని శివాజీ చౌక్ సమీపంలో నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో యువత, మహిళలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలన్నారు.

**మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయం**

**మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి**



తొగుట, అక్టోబర్ 15, మనం న్యూస్ః మాటల్లో చెప్పడం కాకుండా చేతల్లో హామీలను నెరవేర్చే ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మూడోసారి ప్రజలు పట్టం కట్టడం ఖాయమని మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో గెలిచిన తర్వాత తెలంగాణ ప్రజలకు అందించే సంక్షేమ పథకాల మేనిఫెస్టోను ఆదివారం ప్రకటించిన సందర్భంగా నాయకులతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించి సంబరాలు జరుపుకున్నారు. నూతనంగా కేసీఆర్ బీమా పథకం ద్వారా రేషన్ కార్డు ఉన్న వారికి రూ. 5 లక్షల బీమా, సన్న బియ్యం, దశల వారీగా ఆసరా పింఛన్‌ను రూ. 5 వేలకు, వికలాంగుల పింఛన్‌ను రూ. 6 వేలకు పెంచడం జరుగుతుందన్నారు. పెట్టుబడి సాయంగా దశల వారీగా ఎకరానికి రూ. 16 వేల సాయం, దశల వారీగా రూ. 400లకే వంట గ్యాస్ సిలిండర్, ఆరోగ్యశ్రీని రూ.5 లక్షల నుండి రూ.15 లక్షలకు పెంపు వంటి నిర్ణయాలు మేనిఫెస్టోలో ప్రకటించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. వీటి ద్వారా ప్రజలకు ఎంతగానో లబ్ధి చేకూరనుందన్నారు. అదేవిధంగా బిఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డికి బి ఫారమ్ అందించడం పట్ల సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు అధ్యక్షులు బోధనం కనకయ్య, కో ఆప్షన్ సభ్యులు ఎండి. కలీమొద్దీన్, ఎంపిటిసిలు వేల్పుల స్వామి, కొమ్ము శరత్, నాయకులు సుతారి రమేష్, చిలువేరి రాంరెడ్డి, చిలువేరి మల్లారెడ్డి, పాల లక్ష్మణ్ గౌడ్, మంగ నర్సింలు, పాత్కుల వెంకటేశంతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## 'హస్త'ం అవకాశం ఐదుగురికి

**-ఉమ్మడి జిల్లాలో ఐదుగురి పేర్లు రెడీ**



తూముకుంట నర్సారెడ్డి (గజ్వేల్)



తూర్పు జయప్రకాష్‌రెడ్డి (సంగారెడ్డి)

సిద్దిపేట, అక్టోబర్ 15, మనం న్యూస్ ప్రతినిధిః రాబోయే సార్వత్రిక ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ 51 మంది అభ్యర్థులతో తొలి జాబితాను ఆదివారం విడుదల చేసింది. ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాలకు గాను ఐదింటికి అభ్యర్థులను ఖరారు చేసింది. ఒక్కో నియోజకవర్గం నుండి పలువురు అవకాశం కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ స్క్రీనింగ్ కమిటీ పరిశీలన అనంతరం ఐదు గురికి తొలి జాబితాలో అవకాశం కల్పించింది. వీరిలో గజ్వేల్ నియోజకవర్గం నుండి సిద్దిపేట జిల్లా అధ్యక్షులు తూముకుంట నర్సారెడ్డి, సంగారెడ్డి నుండి సి ట్టింగ్ ఎమ్మెల్యే తూర్పు జయప్రకాష్‌రెడ్డి, జహీరాబాద్ నియోజకవర్గం నుండి చంద్రశేఖర్, మెదక్ నియోజకవర్గం నుండి మైనంపల్లి రోహిత్‌రావు, ఆందోల్ నియోజకవర్గం నుండి దామోదర్ రాజనర్సింహాల పేర్లు వెల్లడయ్యాయి. ఈ ఐదుగురికి ముందుగానే ఊహించిన విధంగా అవకాశం లభించినప్పటికీ మిగిలిన స్థానాలకు ఎవరిని ఎంపిక చేస్తారనే ఉత్కంఠ నెలకొంది.



చంద్రశేఖర్ (జహీరాబాద్)



మైనంపల్లి రోహిత్‌రావు (మెదక్)



దామోదర రాజనర్సింహ (ఆందోల్)

# కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలి

## -వచ్చే ఎన్నికల్లో బీజేపి గెలుపు ఖాయం

## -కర్ణాటక బీజేపి మాజీ ఎమ్మెల్యే రాజ్‌కుమార్ పాటిల్

సిద్దిపేట రూరల్, అక్టోబర్ 15, మనం న్యూస్ః వచ్చే ఎన్నికల్లో బీజేపి అధికారంలోకి రావడానికి ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలని కర్ణాటక బీజేపి మాజీ ఎమ్మెల్యే, జిల్లా ఎన్నికల ఇంచార్జ్ రాజ్‌కుమార్ పాటిల్ అన్నారు. ఆదివారం బీజేపి జిల్లా అధ్యక్షులు దూది శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సిద్దిపేట నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ కార్యకర్తలందరూ కలిసికట్టుగా పార్టీని గెలిపించడానికి కృషి





చేయాలన్నారు. రాష్ట్రంలో అవినీతి పాలనను ప్రజలు ఇంటికి పంపించే రోజులు వచ్చాయన్నారు. ఎన్ని భేదాభిప్రాయాలు ఉన్నా సామరస్యంగా ప్రతి ఒక్కరు గెలుపు కోసం పని చేయాలన్నారు. దేశం అన్ని రంగాల్లో ముందుకు పోవాలంటే బీజేపిని గెలిపించుకోవాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి మోదీ సారథ్యంలో అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. సిద్దిపేట నియోజకవర్గానికి టికెట్ ఎవరికి వచ్చినా అభ్యర్థి గెలుపు కోసం పని చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కేంద్రంలో నరేంద్రమోదీ సారథ్యంలో ప్రగతి పథాన ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాసాగర్, వంగ రాంచంద్రారెడ్డి, ఉపేందర్‌రావు, ఉడుత మల్లేశం, నరేష్, పత్రి శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహారెడ్డి, పర్శరాములు, కుమారస్వామి, బుగ్గరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఎస్ఎస్ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపి ప్రభాకర్‌రెడ్డి



దౌల్తాబాద్, అక్టోబర్ 15, మనం న్యూస్ః రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ప్రాథమిక శిక్షావర్గకు దౌల్తాబాద్ మండల కేంద్రంలో ఎంపి ప్రభాకర్‌రెడ్డి హాజరై జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి హిందుత్వం వెన్నెముక లాంటిదని పేర్కొన్నారు. హిందుత్వం కోసం హిందూ ధర్మ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు తనవంతు నిస్వార్థంగా పని చేయాలని యువతను ఉద్దేశించి అన్నారు. వారు కూడా ఈ దేశ పౌరులుగా హిందుత్వ రక్షణకు పనిచేస్తానన్నారు. ఈకార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ మెదక్ విభాగ్ కార్యవాహ భోళా నాగభూషణం, సిద్దిపేట జిల్లా కార్యావాహ మల్యాల ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

## మృతి చెందిన వారికి న్యాయం చేస్తాం

### దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్



సిద్దిపేట రూరల్, అక్టోబర్ 15, మనం న్యూస్ః బతుకమ్మ పండుగ ఏర్పాట్లలో మృతి చెందిన కార్మికుల పట్ల జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జగదేవ్‌పూర్ మండల పరిధి తీగుల్ గ్రామంలోని పటాన్‌చెరువు వద్ద బతుకమ్మ పండుగ సందర్భంగా శుభ్రం చేస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది భారతి, యాదవ్వ, బాబు ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోగా తోటివారు గమనించి పోలీస్ అధికారులకు తెలిపారు. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి మృతదేహాలు వెలికితీయగానే గజ్వేల్ ఏరియా ఆసుపత్రికి తరలించాలని తెలిపారు. అనంతరం గజ్వేల్ ఏరియా ఆసుపత్రి నుండి వచ్చిన జిల్లా కలెక్టర్ అందరు అధికారులతో కలిసి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే మృతి చెందిన వారిలో ఆర్థికంగా ఇల్లు లేని వారికి స్థలం, అర్హత ఉంటే ఉద్యోగం కూడా కల్పిస్తామన్నారు. ఇంటి జాగ కోసం స్థలాన్ని వెతకాలని గజ్వేల్ ఆర్డీఓకు తెలిపారు. తక్షణ సాయం వెంటనే అందించాలని ఎంపిడిఓకు సూచించారు. అందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

## గజ్వేల్‌లో సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ మెజార్టీ ఖాయం



గజ్వేల్, అక్టోబర్ 15, మనం న్యూస్ఃగజ్వేల్‌లో సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ సాధించాలని, లక్ష మెజార్టీ రావాలని కోరుతూ ఆదివారం మదన దుర్గమ్మ ఆలయంలో పీర్లపల్లి గ్రామ సర్పంచ్ యాదవరెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ముడుపు కట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిదేళ్ల సీఎం కేసీఆర్ పాలనలో గజ్వేల్ అభివృద్ధిలో ఆదర్శంగా మారిందన్నారు. మూడోసారి గజ్వేల్‌లో సీఎం కేసీఆర్ లక్ష మెజార్టీతో గెలవాలని అమ్మవారికి ముడుపు కట్టడం జరిగిందన్నారు. ఆయన వెంట నాయకులు వెంకటరెడ్డి, రషీద్ పాల్గొన్నారు.

## అమలుకాని హామీలతో మోసం చేస్తున్న బిఆర్ఎస్

### కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కేసిరెడ్డి రవిందర్‌రెడ్డి



జగదేవ్‌పూర్, అక్టోబర్ 15, మనం న్యూస్ః తెలంగాణ ప్రభుత్వం ఏర్పడి పదేళ్లయినా కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని, కేసీఆర్ ప్రభుత్వం అమలు కాని హామీలు ఇచ్చి మరోసారి తెలంగాణ ప్రజలను మోసం చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కేసిరెడ్డి రవిందర్ రెడ్డి అన్నారు. పదేండ్ల నుండి ఇంత వరకు కొత్త రేషన్ కార్డులు జారీ చేయలేదని, గ్యాస్ సిలిండర్ రూ.400లకు ఇస్తానన్న కేసీఆర్ ఈ పదేండ్లలో ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. వికలాంగుల పింఛన్ రూ. 3016 నుండి రూ. 4016 వరకు చేసిన కేసీఆర్ ఎందుకు రూ. 6016లకు ఇవ్వలేదని, రెండు నెలలకే వికలాంగులపై ఇంత ప్రేమ ఎందుకని ప్రశ్నించారు. రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తామని చెప్తున్న కేసీఆర్ ఇంత వరకు దొడ్డుబియ్యం పంపిణీ చేస్తున్నామని ఒప్పుకోవడమే అన్నారు. దళితులకు ఇస్తానన్న మూడెకరాల హామీ ఏమైందని, గతంలో ఇచ్చిన హామీలు ఏవీ అమలు చేయకుండానే కేసీఆర్ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు.

## మృతుల కుటుంబాలకు ఎఫ్‌డిసి ఛైర్మన్ పరామర్శ



జగదేవ్‌పూర్, అక్టోబర్ 15, మనం న్యూస్ః మండల పరిధిలోని తీగుల్ గ్రామంలో బతుకమ్మ పండుగ సందర్భంగా పటేల్ చెరువు వద్ద పనులు చేయడానికి వెళ్లి చెరువులో ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందిన తీగుల్ పారిశుద్ధ్య కార్మికులు భారతి, బాబు, యాదమ్మ కుటుంబాలను ఆదివారం ఎఫ్‌డిసి ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ. 15 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ పరంగా జిల్లా కలెక్టర్ ద్వారా అన్ని విధాలా సహాయం అందేలా కృషి చేస్తామన్నారు. ఆయన వెంట మండల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

## పొలం వద్ద కరెంటు షాక్‌తో వ్యక్తి మృతి



గజ్వేల్, అక్టోబర్ 15, మనం న్యూస్ః ప్రమాదవశాత్తు పొలం వద్ద కరెంటు షాక్‌కు గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని జాలిగామ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కుమ్మరి కనకయ్య కుమారుడు కుమ్మరి భాస్కర్ (34) ప్రమాదవశాత్తు పొలం వద్ద కరెంటు షాక్‌కు గురై మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎఫ్‌డిసి ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇలాంటి ఘటన జరగడం చాలా బాధాకరమన్నారు. రైతులు పొలాలకు వెళ్లేటప్పుడు విద్యుత్ వైర్ల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. వారి వెంట ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

## సభాస్థలి ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి



సిద్దిపేట రూరల్, అక్టోబర్ 15, మనం న్యూస్ః ఈనెల 17న సిద్దిపేట పట్టణ శివారులో జరగనున్న ప్రగతి ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లను మంత్రి హరీష్‌రావు ఆదివారం పరిశీలించారు. సీఎం కేసీఆర్ రానున్న నేపథ్యంలో సభ ఏర్పాట్లపై నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

## ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బిఆర్ఎస్ మేనిఫెస్టో

### గజ్వేల్ ఏఎంసి ఛైర్మన్ మాదాసు శ్రీనివాస్



గజ్వేల్, అక్టోబర్ 15, మనం న్యూస్ః ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టే విధంగా అద్భుతమైన ప్రజా మేనిఫెస్టోను కేసీఆర్ విడుదల చేశారని గజ్వేల్ ఏఎంసి ఛైర్మన్ మాదాసు శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. రాదనుకున్న తెలంగాణ రాష్ట్రం సాధించడమే కాకుండా దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా ఎదిగేందుకు తెలంగాణ రాష్ట్రానికి బలమైన పునాది వేశారన్నా రు. రాష్ట్ర ఆదాయాన్ని, సంపదను పెంచడం, పెంచిన ఆదాయాన్ని పేద ప్రజలకు పంచడం అనే ఆలోచనతో నేడు గ్రామాల్లోని పేదలకు పలు సంక్షేమ పథకాలను తీసుకువచ్చి కోట్లాది రూపాయల నిధులను గ్రామాల్లో ఖర్చు చేయడం వల్ల నేడు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అయిందన్నారు. సీఎం కేసీఆర్ ఆదివారం ప్రకటించిన మేనిఫెస్టోలో కేసీఆర్ బీమా ద్వారా ప్రతి కుటుంబానికి ఎల్ఐసి బీమా, అన్నపూర్ణ పేరుతో రేషన్‌కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ, ఆసరా పింఛన్‌లు రూ.5 వేలకు పెంపుతోపాటు పలు ప్రజారంజక మేనిఫెస్టోను సీఎం కేసీఆర్ ప్రకటించారన్నారు. వాటి ద్వారా ప్రజలు ఆర్థికంగా వృద్ధి చెందడంతోపాటు వారి సంక్షేమానికి ఉపయోగపడుతాయన్నారు. వచ్చే ఎన్నికల్లో మూడవసారి గజ్వేల్ నుండి సీఎం కేసీఆర్ మరోసారి గెలవనున్నారని, మరోసారి హ్యాట్రిక్ సీఎంగా నిలవనున్నారన్నారు.

# త్వరలో బిఆర్ఎస్‌లోకి



**-సీఎం కేసీఆర్‌కు హ్యాట్రిక్ విజయం అందిస్తాం**

**-బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డికి సంపూర్ణ మద్దతు**

**-కేఆర్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కోమటిరెడ్డి రజనీకాంత్‌రెడ్డి**

దుబ్బాక టౌన్, అక్టోబర్ 15, మనం న్యూస్‌: వివిధ రకాల సేవా కార్యక్రమాలతోపాటు ఇటీవల యువతకు ప్రాధాన్యతనిస్తూ ప్రయాణ సమయంలో వారి ప్రాణాలకు రక్షణగా హెల్మెట్‌లు పంపిణీ చేసి అందరి మన్ననలు పొందిన కేఆర్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కోమటిరెడ్డి రజనీకాంత్‌రెడ్డి త్వరలో బిఆర్ఎస్ పార్టీలో చేరనున్నారు. ఈ మేరకు ఆదివారం దుబ్బాక పట్టణంలోని కేఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వయంగా ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో వివిధ సేవా కార్యక్రమాలను నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహిస్తూ రావడం జరుగుతుందని, దీంతో పలువురు శ్రేయోభిలాషులు, సన్నిహితుల అభీష్టం మేరకు రాజకీయ పార్టీలో చేరేందుకు నిర్ణయించుకోవడం జరిగిందన్నారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నుండి నేటి వరకు నిరంతరం రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి నిరంతరం పాటుపడుతున్న సీఎం కేసీఆర్ సారథ్యంలోని బిఆర్ఎస్ పార్టీలో చేరేందుకు తన సన్నిహితులు, శ్రేయోభిలాషుల సూచన మేరకు నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు త్వరలోనే సుమారు 500 మందితో బిఆర్ఎస్ పార్టీలో చేరి దుబ్బాక బిఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిని లక్ష పై చిలుకు మెజార్టీతో గెలిపించి సీఎం కేసీఆర్‌కు బహుమతిగా అందించడమే తన లక్ష్యమన్నారు. ఈ మేరకు పార్టీలో చేరికకై కార్యాచరణ రూపొందించడం జరిగిందని, బిఆర్ఎస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిలో తాను భాగస్వామ్యం అయ్యేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. అదేవిధంగా పార్టీలో చేరినప్పటికీ కేఆర్ఆర్ ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలను యథావిధిగా కొనసాగించడంతోపాటు పార్టీ ద్వారా ప్రజలకు మరిన్ని సేవలు అందించే అవకాశం దక్కుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. మంత్రి హరీష్‌రావు, కాబోయే ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆశీస్సులతో తాను దుబ్బాక మండలంలో విస్తృత సేవలు అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కేఆర్ఆర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి బిఆర్ఎస్ నాయకుల పరామర్శ



జగదేవ్‌పూర్, అక్టోబర్ 15, మనం న్యూస్‌: జగదేవ్‌పూర్ మండల పరిధిలోని బిజి వెంకటాపూర్ గ్రామంలో సఫాయి కార్మికుడిగా పని చేస్తున్న చీకట్లో మల్లయ్య మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పిఏసిఎస్ మాజీ ఛైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు రవిందర్‌రెడ్డి, పీర్లపల్లి ఎంపిటిసి మహిపాల్‌రెడ్డిలు ఆదివారం వారి కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. బాధిత కుటుంబానికి తాము అండగా ఉంటామని, అధైర్య పడవద్దని సూచించారు. వారి వెంట అమర్ రాము, ఉప సర్పంచ్ శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రూపేష్, రాజశేఖర్, బలరాం, పోకల నరసింహులు, భాను, సురేష్, రవి, నవీన్, నాగరాజు, ప్రశాంత్ పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి మార్కెట్ సంఘం చేయూత



దుబ్బాక, అక్టోబర్ 15, మనం న్యూస్‌: దుబ్బాక మండల పరిధిలోని రామక్కపేట గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన కిషన్ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న దుబ్బాక కూరగాయల మార్కెట్ సభ్యులు వారి కుటుంబానికి కూరగాయ మార్కెట్ సంఘం తరుపున పరామర్శించి 50 కిలోల బియ్యం అందజేశారు. అధైర్యపడవద్దని, ధైర్యంగా ఉండాలని వారి కుటుంబానికి భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ సంఘం అధ్యక్షులు అల్లం సాగర్, ఉపాధ్యక్షులు చౌకి భాను, రెడ్డబోయిన గిరిబాబు, మజీద్ , వనం పోచయ్య, శ్రీకాంత్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి

**డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి**



జగదేవ్‌పూర్, అక్టోబర్ 15, మనం న్యూస్‌: జగదేవ్‌పూర్ మండలం తీగుల్ గ్రామంలో బతుకమ్మ పండుగ సందర్భంగా కట్టపై ఉన్న చెత్తను తొలగించి శుభ్రం చేసే క్రమంలో కాలు జారి చెరువులో పడి మృతి చెందిన భారతి, యాదమ్మ, బాబుల పార్థివదేహాలను ఆదివారం డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి సందర్శించి బాధిత కుటుంబాలను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరుపున ప్రతి కుటుంబానికి రూ. 50 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, వారి కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. దీనిపై వెంటనే ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబాలక సరైన న్యాయం చేయాలన్నారు.

## సంక్షేమ మేనిఫెస్టోతో ప్రతిపక్షాలలో గుబులు

**-హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్**

**-ములుగు ఆత్మ కమిటీ ఛైర్మన్ గుండా రంగారెడ్డి**



గజ్వేల్, అక్టోబర్ 15, మనం న్యూస్‌: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొమ్మిదిన్నరేళ్లలో తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపి దేశానికే ఆదర్శంగా నిలిపి సీఎం కేసీఆర్ వచ్చే ఎన్నికల దృష్ట్యా ప్రవేశపెట్టిన మేనిఫెస్టో ప్రతిపక్షాల్లో గుబులు రేపుతుందని ములుగు ఆత్మ కమిటీ ఛైర్మన్ గుండా రంగారెడ్డి అన్నారు. ఆదివారం రోజున ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తెలంగాణ ప్రజలకు వెన్నుదన్నుగా నిలిచే విధంగా సీఎం కేసీఆర్ మేనిఫెస్టోను ప్రకటించారన్నారు. గతంలో రైతులకు మాత్రమే బీమా సౌకర్యం ఉందని, నేడు ప్రతి కుటుంబానికి బీమా సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అంతేకాకుండా దశల వారీగా ఆసరా పింఛన్‌ను రూ. 5 వేల వరకు, వికలాంగుల పింఛన్‌ను రూ. 6 వేల వరకు పెంచడం జరుగుతుందన్నారు. సౌభాగ్యలక్ష్మి పథకం ద్వారా నిరుపేద మహిళలకు నెలకు రూ. 3 వేల సాయం, రైతులకు పెట్టుబడి సాయం కింద దశల వారీగా ఏడాదికి రూ. 16 వేలు సాయం, దశల వారీగా రూ. 400లకే గ్యాస్ సిలిండర్ సౌకర్యం, ఆరోగ్య శ్రీని రూ.5 లక్షల నుండి రూ. 15 లక్షల వరకు పెంచడంతో పాటు మరెన్నో ప్రజారంజక పథకాలను సీఎం కేసీఆర్ మేనిఫెస్టోలో పొందుపరిచారన్నారు. అవే నేడు బిఆర్ఎస్ గెలుపుకు దోహదపడుతాయని, మూడవసారి గజ్వేల్ నుండి కేసీఆర్ ఎమ్మెల్యేగా గెలిచి, హ్యాట్రిక్ సీఎంగా నిలుస్తారన్నారు.

## నూతన కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

**కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్**



అమీన్‌పూర్, అక్టోబర్ 15, మనం న్యూస్‌: అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని నూతన కాంగ్రెస్ కార్యాలయాన్ని ఆదివారం రోజున నియోజకవర్గ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వంలో సామాన్యుడికి విలువ లేకుండాపోయిందన్నారు. గత ఎన్నికల్లో తాను ఓడిపోయినా కూడా మీ మధ్యలోనే ఉండి ప్రజల సమస్యలు తెలుసుకోవడం జరిగిందన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో సామాన్యులకు స్వేచ్ఛ లేదు అని, ఎదురు నిలిచిన వారిపై ఏదో ఒక కేసు పెట్టడం బిఆర్ఎస్‌కు అలవాటుగా మారిందన్నారు. ఈ దొరల పాలన పోవాలంటే హస్తం గుర్తుకు ఓటేసి గెలిపించాలని, మీ వెంట నేనుంటానని, 45 రోజులు నా కోసం కష్టపడితే ఐదేళ్ల పాటు మీ కోసం నేను కష్టపడుతానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు అశోక్ ముదిరాజ్, మున్సిపాలిటీ అధ్యక్షులు శశిధర్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు, జిల్లా మహిళా అధ్యక్షులు కాటా సుధా శ్రీనివాస్ గౌడ్, పిటిసిలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.





# ఆరంభం అదుర్స్

- గులాబీమయమైన హుస్నాబాద్
- కళకళలాడిన ఆశీర్వాద సభ
- సభ సక్సెస్‌తో ఆనందంలో గులాబీదండు
- ఆకట్టుకున్న కళాకారుల నృత్యాలు
- జై తెలంగాణ అంటూ యువత కేరింతలు
- భారీగా పోలీసు బందోబస్తు



హుస్నాబాద్,అక్టోబర్ 15,(మనం న్యూస్)ః ఎన్నికల తొలి ప్రచారాన్ని రాష్ట్రానికి ఈశాన్య ప్రాంతమైన హుస్నాబాద్ నుండి మూడోసారి నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభ సూపర్ హిట్టు అయ్యింది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన వెంటనే అన్నీ పార్టీల కంటే ముందే తమ అభ్యర్థులను ప్రకటించిన కేసీఆర్ సెంటిమెంట్ నియోజకవర్గమైన హుస్నాబాద్ నుండి మరోసారి ఎన్నికల సమరశంఖంను పూరించారు. సీఎం కేసీఆర్ సభకు జనం పోటేత్తారు. మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌లు హుస్నాబాద్ సభకు భారీగా జనాన్ని తరలించేందుకు చేసిన వ్యూహరచన సఫలీకృతమైంది. అనేక ఉద్యమాలకు పురిటిగడ్డగా నిలిచిన హుస్నాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా ప్రజల మధ్యలోనే సీఎం కేసీఆర్ వొడితల సతీశ్‌కుమార్‌కు బీ-ఫారమ్ అందజేసారు. ప్రజా ఆశీర్వాద సభతో నిర్వహించిన సభకు భారీగా జనం తరలిరావడంతో గులాబీ గెలుపు ఖాయమని బీఆర్ఎస్ నాయకులు ధీమా వ్యక్తం చేసారు. హుస్నాబాద్ నియోజకవర్గ బహిరంగ సభకు జనాన్ని తరలించేందుకు ఆయా మండలాల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు విజయవంతం చేసారు.



### చప్పట్లు, కేరింతలు........

ప్రజా ఆశీర్వాద సభ వేదిక పై సీఎం కేసీఆర్ ప్రసంగిస్తున్న ప్రతి సందర్భంలో ప్రజలు చప్పట్లు కొడుతూ కేరింతలతో సభా ప్రాంగణానిన ఉత్తేజపరిచారు. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌లు వేదిక పై అభివాదం చేయగా ప్రజలు జై తెలంగాణ అంటూ పెద్ద నినాదాలు చేసారు.

### సంస్కృతిని ప్రతిబింబించిన కళారూపాలు

హుస్నాబాద్‌లోని విద్యుత్ సబ్‌స్టేషన్ పక్కన ఖాళీ స్థలంలో నిర్వహించిన సభ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు అద్దం పట్టింది. నియోజకవర్గ సభగా ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించడంతో ఏడు మండలాల నుండి జనాలు భారీగా తరలివచ్చారు.

### ఆకట్టుకున్న ప్రసంగాలు..........

హుస్నాబాద్‌లో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో అందరి ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. సీఎం కేసీఆర్ తన ప్రసంగంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన కార్యక్రమాలు ప్రజలకు వివరించారు. అలాగే కాంగ్రెస్ పార్టీనీ నమ్మితే మరోసారి మోసం చేస్తారని విమర్శించారు. ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ మంచి నాయకుడని, అలాంటి నాయకునికి మద్ధతు ఇవ్వాలని సీఎం కేసీఆర్ పిలుపునిచ్చారు. మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ బీఆర్ఎస్ మేనిఫెస్టోలో ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని అన్నారు. ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ మచ్చలేని నాయకుడని, రాబోయే ఎన్నికల్లో భారీ విజయం కట్టబెట్టాలని, సతీశ్ కుమార్ అభివృద్ధి కోసం తపనపడే నాయకుడని అన్నారు. వినోద్‌కుమార్ మాట్లాడుతూ ప్రతిపక్షాలు చెప్పే మాయమాటలు, ఎన్నికల హామీలు నమ్మి మోసపోవద్దని హితవు పలికారు.

### సీఎం కేసీఆర్ చేతుల మీదుగా బీ-ఫారం అందుకున్న ఎమ్మెల్యే సతీశ్............

తెలంగాణ భవన్‌లో ఆదివారం ఎమ్మెల్యే అభ్యర్థులకు 51 మందికి సీఎం కేసీఆర్ బీ-ఫారాలు అందజేసిన విషయం తెలిసిందే. కాగా హుస్నాబాద్‌లో వేదిక పై సీఎం కేసీఆర్ తన ప్రసంగం ముగిసిన తర్వాత సతీశ్‌కుమార్‌కు తన చేతుల మీదుగా బీ-ఫారం అందజేసారు. సిఎం సతీశ్‌కుమార్‌కు ‘‘ఆల్ ది బెస్ట్ సతీశ్’’ అంటూ శుభాకాంక్షలు తెలియజేసారు. అనంతరం సీఎం కేసీఆర్‌కు సతీశ్‌కుమార్ కృతజ్ఞతలు తెలియజేసి ఆశీర్వాదం తీసుకున్నారు.






### సభ సక్సెస్‌తో ఆనందంలో గులాబీ దండు............

హుస్నాబాద్‌లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభ సక్సెస్ అవ్వడంతో గులాబీ పార్టీ శ్రేణుల్లో ఆనందోత్సహాలు వెల్లువెత్తుతున్నాయి. పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేసారు. ఎమ్మెల్యే తనయుడు యువనేత ఇంద్రనీల్ యువతలో జోష్ నింపి సభలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సభ ముగిసిన తర్వాత కేసీఆర్ హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు వెళ్లగా, మంత్రి హరీశ్‌రావు సిద్దిపేటకు వెళ్లారు. సీఎం కేసీఆర్‌కు ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ వీడ్కోలు పలికారు. సభ అనుకున్న దానికంటే ఎక్కువ జనం వచ్చి భారీగా సక్సెస్ అవ్వడంతో గులాబీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు.










### భారీ బందోబస్తు.............

సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు సిద్దిపేట పోలీస్ కమీషనర్ శ్వేత ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగా అన్ని చర్యలు చేపట్టారు. ఈ సభలో కె.కెశవరావు, దేశపతి శ్రీనివాసరావు, బోయినపల్లి వినోద్‌కుమార్, కెప్టెన్ లక్ష్మీకాంతరావు, వొడితల సతీశ్‌కుమార్ కుటుంబ సభ్యులు హాజరయ్యారు. గాయకుడు ఏపూరి సోమన్న తన పాటలతో ఉర్రూతలూగించారు.





